చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్‌నినో.. అసాధారణ స్థాయికి ఉష్ణోగ్రతలు!

2

Neti Velugu

నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 190 | పేజీలు : 8 | అక్టోబర్ 23 శుక్రవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 190 | PAGES:8 | FRIDAY OCTOBER 23 2026 | Rs. 4:00

బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం

సీఎం రేవంత్ కీలక ప్రకటన



- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలి
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశంపై పరిశీలన
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు
- పండుగ సాయన్న దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను

(మిగతా 2వ పేజీలో..)

స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన.. ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

- ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ జ్యోతిని వెలిగించాలని పిలుపు
- భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి
- ఉగ్రవాదంపై నేలపైనా, గగనతలంలోనూ పోరాడుతున్నామన్న నేతలు
- పశ్చిమాసియాలో శాంతి స్థాపనపై ఇరు దేశాధినేతల చర్చలు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ నుంచి ఒక అరుదైన గౌరవం లభించింది. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా మోదీని ఆహ్వానించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో కలిసి ఈ జ్యోతిని వెలిగించాలని కోరడం ఈ ఆహ్వానంలోని విశేషం.గురువారం ఇరువురు నేతలు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియజేశారు.

(మిగతా 2వ పేజీలో..)



డిండికి నీటి తరలింపు ఆపండి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ



డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్

(మిగతా 2వ పేజీలో..)

సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

- తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ
- రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్రను కొనియాడిన కేటీఆర్
- వేడుకల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ
- పాల్గొననున్న 33 జిల్లాలకు చెందిన జానపద కళాకారులు



సిరిసిల్లలో త్వరలో

(మిగతా 2వ పేజీలో..)

మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

- తమిళనాడులో మంత్రులు, ఎమ్మెల్యేల అధికారిక వాహనాలపై ధరల పరిమితి
- మంత్రులకు రూ. 26 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షలుగా గరిష్ఠ ధర
- పదవి కోల్పోతే వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలన్న నిబంధన
- ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్ ద్వారానే కొనుగోలు చేయాలన్న ప్రభుత్వం
- ఏటా వాహనాల కొనుగోలు ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు అవకాశం

తమిళనాడు ప్రభుత్వం మంత్రులు, శాసనసభ్యులకు కేటాయించే అధికారిక వాహనాల కొనుగోలుపై కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. మంత్రులు, ఇతర సీనియర్

(మిగతా 2వ పేజీలో..)



మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం

రాహుల్ విదేశీ పర్యటనలపై

(మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి తెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు.ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన.. ప్రధాని మోదీకి నెతన్యాహు నుంచి ప్రత్యేక ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

భారత్, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాదంపై పోరాడుతున్నాయని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.గత సెప్టెంబర్‌లో దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న 'ఫ్లైదుబాయ్' విమానంలో తన సహ పైలట్ జరిపిన దాడిని భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ వీరోచితంగా అడ్డుకున్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ, ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, దాడి చేసిన వ్యక్తిని సిబ్బందికి అప్పగించడమే కాకుండా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. "ఇజ్రాయెల్, భారత్ సహా యావత్ ప్రపంచానికే ఆయన ఒక హీరో" అని నెతన్యాహు కొనియాడారు. ఆయన సాహసాన్ని గౌరవిస్తూ ఈ ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఈ సంభాషణలో భాగంగా ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, అక్కడ శాంతి, స్థిరత్వం నెలకొల్పాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.

చరిత్రలోనే అత్యంత బలమైన ఎల్‌నినో..
అసాధారణ స్థాయికి ఉష్ణోగ్రతలు!

- పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 3.8 డిగ్రీల వరకు పెరిగే అవకాశం
- భారత్‌లో శీతాకాలంలో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం తగ్గుదల అంచనా
- కొన్ని దేశాల్లో వరదలు, మరికొన్ని దేశాల్లో తీవ్ర కరవు పరిస్థితులు
- ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలన్న డబ్ల్యూఎంవో

ప్రపంచ వాతావరణంపై ఎల్‌నినో తీవ్ర ప్రభావాన్ని చూపబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో.. గతంలో ఎన్నడూ చూడని తీవ్రస్థాయికి చేరుకోవచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరిక జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు నుంచి 2027 జనవరి మధ్య కాలంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కన్నా 3.8 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది.సాధారణంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత 0.5 డిగ్రీలు పెరిగితేనే ఎల్‌నినోగా ప్రకటిస్తారు. కానీ ఈసారి ఏకంగా 3.8 డిగ్రీల పెరుగుదల ఉంటుందన్న అంచనా వాతావరణ నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. డిసెంబరు నాటికి ఇది గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని డబ్ల్యూఎంవో తెలిపింది. గత నాలుగు దశాబ్దాల వాతావరణ చార్ట్‌ల అంచనాలకు మించి ప్రస్తుత పరిస్థితి ఉందని డబ్ల్యూఎంవో సెక్రెటరీ జనరల్ సెలెస్టే సౌలో ఆందోళన వ్యక్తం చేశారు.ఈ తీవ్రమైన ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో పెను మార్పులకు కారణం కానుంది. ముఖ్యంగా భారత్ సహా దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల్లో శీతాకాలంలోనూ సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీంతో పాటు వర్షపాతం గణనీయంగా తగ్గిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది వ్యవసాయ రంగంపై, తాగునీటి వనరులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.మరోవైపు, తూర్పు ఆఫ్రికా, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చని డబ్ల్యూఎంవో అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణాఫ్రికాలో పొడి వాతావరణం, మధ్య అమెరికా, అమెజాన్ ప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొంటాయని తెలిపింది. చాలా బలమైన ఎల్‌నినో.. సాధారణ ఉష్ణోగ్రతలను, వర్షపాత సరళిని పూర్తిగా దెబ్బతీస్తుందని పేర్కొంది.2026 చివరి నాటికి ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకున్నప్పటికీ, దాని ప్రభావాలు చాలా కాలం పాటు కొనసాగుతాయని సెలెస్టే సౌలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వాతావరణ ముప్పులను ఎదుర్కోవడానికి అన్ని దేశాలు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని, తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.



బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం.. సీఎం రేవంత్ కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.

తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

డిండికి నీటి తరలింపు ఆపండి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులకు రూ. 26 లక్షల వరకు, ఇతర ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షల వరకు గరిష్ఠ ధర పరిమితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభ్యుల ప్రయాణ భత్యం నిబంధనలను సవరిస్తూ కొత్త గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.నూతన నిబంధనల ప్రకారం.. మంత్రులతో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు, ప్రభుత్వ చీఫ్ విప్‌ల కోసం కొనుగోలు చేసే వాహనం ధర రూ. 26 లక్షలకు మించకూడదు. మిగతా ఎమ్మెల్యేలందరికీ ఈ పరిమితిని రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఈ గరిష్ఠ ధరలోనే వాహనం ఎక్స్-షోరూమ్ ధర, పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మోటారు ఇన్సూరెన్స్ ప్రీమియంలు కలిసి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే, ఏటా ఈ ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాహనాల కొనుగోలును కేంద్ర ప్రభుత్వానికి చెందిన "గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్" (GeM) పోర్టల్ ద్వారానే చేపట్టాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొనుగోలు చేసే వాహనాలు తప్పనిసరిగా భారత్ స్టేజ్-VI (BS-VI) ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. మంత్రులకు కేటాయించే వాహనాలను తమిళనాడు ప్రభుత్వం తన పేరుపైనే కొనుగోలు చేస్తుంది. స్పీకర్, ఇతర శాసనసభ్యుల వాహనాల కొనుగోలు ప్రక్రియను అసెంబ్లీ సచివాలయం పర్యవేక్షిస్తుంది.మంత్రులు తమ పదవీకాలం ముగిసినప్పుడు, అనర్హత వేటుకు గురైనప్పుడు లేదా ఇతర కారణాలతో పదవిని కోల్పోయినప్పుడు తమకు కేటాయించిన వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. స్పీకర్, ఇతర ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే, సాధారణ ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన వాహనాల నిర్వహణ, మరమ్మతులు, ఇంధనం, డ్రైవర్ వేతనాల ఖర్చును వారికి చెల్లించే వాహన భత్యం నుంచే భరించాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల వాహన అర్హతలు, కొనుగోలు ప్రక్రియ, పరిపాలనా బాధ్యతలపై స్పష్టతనిస్తూ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇ. సుందరవల్లి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

బీజేపీ నేతల వరుస ఆరోపణలు

జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా

నిరసనలు కాదు.. గెలిచిన చోట ప్రణాళికలు చూపాలని విపక్షాలకు షా హితవు

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం.ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది.ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు.ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి!





- **నీటి వనరులపై తక్షణమే ఆడిట్ నిర్వహించాలి**
- **అధికారులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాలు**
- **ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలి.. పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలి**

నల్గొండ జిల్లా అక్టోబర్ 22 నేటి వెలుగు ప్రతినిధి:

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి నివేదికలు సమర్పించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు, నీటి సంరక్షణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.గురువారం తన చాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో పాటు శాస్త్రవేత్తలతో ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో తాగునీటి పరిస్థితులపై సమావేశం నిర్వహించారు. నీటి వినియోగంలో బాధ్యత అవసరంఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సతీష్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా తాగునీరు, సాగునీరు, విద్యుత్, వ్యవసాయం తదితర రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి గ్రామంలో నీటి వనరులపై ఆడిట్

జిల్లాలోని ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ, రాబోయే రోజుల్లో నీటి మట్టాలు తగ్గే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వానాకాలం వచ్చే వరకు అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. నీటి వృథా కారణంగా భవిష్యత్తులో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ప్రజలకు వివరించాలని అధికారులకు తెలిపారు.జిల్లాలోని ప్రతి గ్రామం, మండలం, మున్సిపల్ ప్రాంతంలో ఉన్న నీటి వనరులు, వాటిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి పరిమాణం తదితర వివరాలను తక్షణమే సేకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతి గ్రామంలో నీటి వనరుల ఆడిట్ నిర్వహించాలని స్పష్టం చేశారు.

పైప్‌లైన్ లీకేజీలకు అడ్డుకట్ట వేయాలి

తాగునీటి సరఫరా పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వృథా జరగని గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి వాటిని 'నీటి వృథా లేని గ్రామాలు, జోన్లు'గా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ సందేశం ప్రతి గ్రామానికి, ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు, డీపీఓ తరుణ్ చక్రవర్తి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి!







- **సీసీఐ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ బి. చంద్రశేఖర్**
- **తూకం, ధరల్లో తేడాలు ఉండకూడదు.. రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి**

నల్గొండ, అక్టోబర్ 22 (నేటి వెలుగు ప్రతినిధి):

పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడటంతోపాటు, తూకం, ధరల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.గురువారం నల్గొండ జిల్లా మునుగోడు సమీపంలోని సల్సార్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన పత్తి వివరాలు, కొనుగోళ్ల పురోగతి, తేమ శాతం, తూకం విధానం తదితర అంశాలపై సీసీఐ అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్ సమస్యలపై వెంటనే స్పందించాలి పత్తి విక్రయించేందుకు స్లాట్ బుకింగ్‌లో రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించి, కొనుగోలు నిబంధనల ప్రకారం ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, సీసీఐ రిజిస్టర్‌కు, జిన్నింగ్ మిల్లు రిజిస్టర్‌కు మధ్య తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు.ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా క్వింటాల్‌కు రూ.9,160 చొప్పున పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు కలెక్టర్‌కు వివరించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, తూకం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

అనంతరం కొనుగోలు కేంద్రం సమీపంలోని పత్తి రైతులతో కలెక్టర్ మాట్లాడారు. రైతులు ఏ గ్రామం నుంచి వచ్చారు, ఎకరాకు ఎంత దిగుబడి వస్తోంది, గ్రామాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉంది, గత యాసంగిలో ఏ పంటలు సాగు చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రైతులకు మార్కెటింగ్ అనుసంధానం

మునుగోడు ప్రాంతంలో మినుములు, కుసుమ, ఆముదం వంటి పంటల సాగుకు అనుకూలమైన భూములు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు సమిష్టిగా పంటలు సాగు చేస్తే, పంటల విక్రయాలకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చన్నారు. పంట పండిన వెంటనే రైతులు విక్రయించుకునేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవిని ఆదేశించారు.సబ్సిడీపై విత్తనాలు, సూక్ష్మ సేద్య పరికరాలు నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో చిరుధాన్యాలు, కూరగాయలు సాగు చేసే రైతులకు సబ్సిడీపై బిందు, తుంపర సేద్య పరికరాలు, విత్తనాలు అందించే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. స్వల్పకాలంలో దిగుబడినిచ్చే పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు.రైతులకు సబ్సిడీ విత్తనాలు, అవసరమైన సదుపాయాలు, మార్కెటింగ్ అనుసంధానం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్‌ను ఆదేశించారు. రైతులకు పంట సాగు నుంచి విక్రయం వరకు అవసరమైన సహకారం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, డీసీఓ మమత, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వీరుడు పండుగ సాయన్న: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్‌లో ఘనంగా 174వ జయంతి వేడుకలు

సూర్యాపేట, అక్టోబర్ 22 నేటి వెలుగు ప్రతినిధి:

నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుస్తారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొన్నారు. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా.. మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన పండుగ సాయన్న చిన్నతనం నుంచే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని కలెక్టర్ తెలిపారు. పలువురు అధికారులు, బీసీ సంఘాల నాయకుల హాజరు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీవో శ్రీరామ్ పాల్గొన్నారు. అలాగే ముదిరాజ్ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు ఈదుల యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కళా కరుణాకర్, కందుల రమేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల నరసింహ, జై గౌడ అధ్యక్షుడు బూర మాల్సూర్ గౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు పి. వీరాచారి, టీయూడబ్ల్యూజే--ఐజేయూ సూర్యాపేట జిల్లా ప్రచార కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాం ప్రభువు, మాజీ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి దున్న శ్యాం తదితర సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పేదల పక్షాన నిలిచి.. దోపిడీని ఎదిరించి.. ప్రజల గుండెల్లో నిలిచిన పోరాట యోధుడు పండుగ సాయన్న: మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 22 నేటి వెలుగు ప్రతినిధి:



పేదలు, అణగారిన వర్గాల పక్షాన నిలిచి, భూస్వాములు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు పండుగ సాయన్న అని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పేదల పట్ల ఆయన చూపిన ఆదరణ, అన్యాయాన్ని ఎదిరించిన పోరాట స్ఫూర్తి కారణంగానే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.గురువారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. వంశీ కృష్ణ, కార్పొరేటర్లు, కార్యాలయ సిబ్బందితో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పండుగ సాయన్నను జానపద కథనాల్లో 'తెలంగాణ రాబిన్ హుడ్'లిగా అభివర్ణిస్తారని పేర్కొన్నారు. సంపన్న వర్గాల దోపిడీని ఎదిరిస్తూ, పేదలు మరియు అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిలబడిన ప్రజావీరుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, బలహీన వర్గాలకు అండగా నిలవాలనే ఆయన పోరాట తత్వం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.మహనీయుల జీవితాలు, వారి త్యాగాలు, ప్రజల కోసం వారు చేసిన పోరాటాలు భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని మేయర్ అన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సామాజిక బాధ్యత, ప్రజా సంక్షేమం వంటి విలువలను బలోపేతం చేయడానికి ఇటువంటి జయంతి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పండుగ సాయన్న ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. వంశీ కృష్ణతో పాటు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామకోటి స్తూప దేవాలయంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పూజలు

నల్గొండ అక్టోబర్ 22 నేటి వెలుగు ప్రతినిధి:





నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ యార్డులో గల రామకోటి స్తూప దేవాలయంలో గురువారం దుర్గామాత శోభయాత్ర ఘనంగా ప్రారంభమైంది. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి దంపతులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు యమ కవితా దయాకర్, రేగట్ట లింగస్వామి గౌడ్, వెంకటేశ్వర్లు యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, ఆర్యవైశ్య సంఘం నేతలు పాల్గొన్నారు.

సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న

రంగారెడ్డి కలెక్టరేట్‌లో తెలంగాణ రాబిన్‌హుడ్ 174వ జయంతి వేడుకలు



రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 22 నేటి వెలుగు ప్రతినిధి:

సమానత్వం, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం పోరాడిన బహుజన వీరుడు పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి పేద ప్రజలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఆర్థిక, సామాజిక అసమానతలు కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం అందాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం అవసరమని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరాల్సి ఉందన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన నిలిచిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో పండుగల సాయన్న జన్మించారని మల్లేష్ యాదవ్ వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి పాలనలో పేద రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భూస్వాముల దోపిడీని చూసి చలించిపోయారని పేర్కొన్నారు.. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన పండుగల సాయన్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

పెళ్లి పీటలెక్కనున్న 'హనుమాన్' హీరో.. తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు.తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.'హనుమాన్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత 'మిరాయ్'తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

దసరా వేడుకలో నోరు జారిన రణ్‌బీర్.. క్షమాపణ కోరిన రామాయణ రాముడు

- **కోల్‌కతా దసరా వేడుకలో రణ్‌బీర్ కపూర్ వ్యాఖ్యల దుమారం**
- **మంచితనానికే అంతం అని అర్థం వచ్చేలా మాట్లాడటంతో వివాదం**
- **చెన్నైలో తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పిన రణ్‌బీర్ కపూర్**

బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌బీర్ కపూర్ తన వ్యాఖ్యల పట్ల తలెత్తిన వివాదంపై క్షమాపణలు చెప్పారు. కోల్‌కతాలో జరిగిన దసరా వేడుకలో తాను పొరపాటున మాట్లాడానని ఆయన పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నమైన పండుగ స్ఫూర్తిని తప్పుగా చెప్పే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం 'రామాయణ' ప్రచార కార్యక్రమంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు.

అసలేం జరిగింది?

నితీశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో నటిస్తున్న 'రామాయణ' సినిమా ప్రచారంలో భాగంగా, అక్టోబర్ 20న కోల్‌కతాలోని సాల్ట్ లేక్ సెంట్రల్ పార్క్‌లో "రామ్ ఎర్ అయోధ్య" పేరుతో దసరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రణ్‌బీర్, పండుగ ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ పొరపాటున "చెడు ఎంత శక్తిమంతమైనదైనా, చివరికి సత్యం, మంచితనానికే అంతం జరుగుతుంది" అని అర్థం వచ్చేలా హిందీలో వ్యాఖ్యానించారు. చెడుపై మంచి గెలుస్తుందనే దసరా సందేశానికి ఇది పూర్తిగా విరుద్ధంగా ఉండటంతో సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి.

చెన్నైలో క్షమాపణలు

ఈ ఘటన జరిగిన మరుసటి రోజే చెన్నైలో జరిగిన 'రామాయణ' చిత్ర ఆల్బమ్ విడుదల కార్యక్రమంలో రణ్‌బీర్ ఈ వివాదంపై స్పందించారు. తన సహనటి సాయి పల్లవితో కలిసి వేదికపైకి వచ్చిన ఆయన, "నిన్నటి దసరా వేడుకలో జరిగిన పొరపాటుకు క్షమాపణలు కోరుతున్నాను. అది కేవలం నోరు జారడం వల్లే జరిగింది తప్ప మరో ఉద్దేశంలేదు" అని వివరించారు.తాను చెప్పాలనుకున్న అసలు విషయం "చెడు ఎంత శక్తిమంతమైనదైనా, అంతిమంగా విజయం సాధించేది సత్యం, మంచితనమే" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన పాత చిత్రం 'రాక్‌స్టార్'లో ఏ.ఆర్. రెహమాన్ స్వరపరిచిన "జో భీ మై కెహనా చాహూ, బర్బాద్ కరే అల్ఫాజ్ మేరే" అనే పాటను గుర్తుచేసుకుంటూ, తన పరిస్థితి అలాగే ఉందని చమత్కరించారు. ఈ పొరపాటు ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని ఆయన మరోసారి నొక్కి చెప్పారు.రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న 'రామాయణ' చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. రాముడి పాత్రను పోషిస్తున్న నటుడే దసరా పండుగపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైనప్పటికీ, ఆయన వెంటనే స్పందించి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.





పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా 'అక్క'..

కీర్తి, రాధిక మధ్య భీకర పోరాటం!

కీర్తి సురేశ్, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'అక్క' చిత్ర ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ గురువారం విడుదల చేసింది. వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాకు ధర్మరాజ్ శెట్టి రచన, దర్శకత్వం వహించారు. అధికారం, వారసత్వం, ప్రతీకారం వంటి అంశాల నేపథ్యంలో ఈ కథ సాగనున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది.భిన్నమైన ఆశయాలు, దృఢమైన నమ్మకాలు కలిగిన ఇద్దరు శక్తిమంతమైన మహిళల మధ్య సాగే ఆధిపత్య పోరును ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారు. ఇందులో భవాని అనే పాత్రలో కీర్తి సురేశ్, రుద్ర పాత్రలో రాధికా ఆప్టే నటిస్తున్నారు. వీరితో పాటు తన్వీ అజ్మీ, మహేశ్ మంజ్రేకర్, అన్నమన్ పుష్కర్, మోనికా పన్వర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.తన పాత్ర గురించి కీర్తి సురేశ్ మాట్లాడుతూ.. "భవాని తన విలువల కోసం నిలబడే మహిళ. తన వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతటి సాహసానికైనా సిద్ధపడుతుంది. రాధికా ఆప్టేతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభవం. మా రెండు పాత్రలు తెరపై విభిన్నమైన ఎనర్జీని ప్రదర్శిస్తాయి" అని తెలిపింది.రుద్ర పాత్ర గురించి రాధికా ఆప్టే స్పందిస్తూ.. "రుద్ర పరిస్థితులకు లొంగిపోయే వ్యక్తి కాదు, వ్యవస్థను ధైర్యంగా ఎదిరిస్తుంది. ఇది కేవలం అధికారం కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు; నమ్మకాలు, విధేయతలకు సంబంధించినది. కీర్తితో కలిసి నటించడం పట్ల చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్, వైఆర్ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఇద్దరు బలమైన మహిళల గాథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్ విడుదల కావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**